ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

కర్నూలు

జిల్లా వార్తలు

సోమవారం 12 ఫిబ్రవరి 2024





కర్నూలు నగర పాలకసంస్థలో దోమలు దండయాత్ర చేస్తున్నాయి. గాలి వీస్తే కొట్టుకుపోయే దోమలు పగలు, రాత్రి తేడా లేకుండా ప్రజల మీద దాడి చేస్తున్నాయి. రోజువారీ జీవితంలో ఎన్నో కష్టనష్టాలను అధిగమించిన జనాలు దోమల దండయాత్రను ఎదుర్కోలేకపోతున్నారు. తుంగభద్ర.. హంద్రీ.. కేసీ కాలువలు, చెత్తా చెదారం నిండిన మురుగు కాలువలు, అపరిశుభ్ర ప్రాంతాల మీద నుంచి దోమలు ఇబ్బడిముబ్బడిగా వృద్ధి చెంది నగరాన్ని చుట్టుముడుతున్నాయి. వీటి కాటు వల్ల నగర ప్రజలు విష జ్వరాల బారిన పడుతూ విలవిల్లాడుతున్నారు. ఈ క్రమంలో ఇటీవలి కాలంలో డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. నగరపాలక సంస్థ అధికారుల నిర్లక్ష్యానికి జనాలు అవస్థలు పడుతున్నా ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు మాత్రం ప్రజా కష్టాలను పట్టించుకోవడం లేదు. కనీసం దోమల నివారణ చర్యలు కూడా చేపట్టకపోవడంతో అధికారులు, ప్రజాప్రతినిధులపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

# జ్వర భద్రం

- నగర ప్రజలపై దోమల దండయాత్ర
- విజృంభిస్తున్న డెంగీ, మలేరియా
- ఏడాదిలో 145 డెంగీ కేసులు నమోదు
- పొద్దువాలితే వీధుల్లో తిరగలేరు.. ఇళ్లలో ఉండలేరు
- నివారణకు ముందస్తు చర్యలు శూన్యం

**కర్నూలు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి):** కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలోని 52 వార్డుల్లో దోమలదే తిరుగులేని రాజ్యం. వాటిని ఎవ్వరూ ఏమీ చేయలేనంతగా బలిసిపోయాయి. అల్ప ప్రాణులైన దోమల ధాటికి జనం తల్లడిల్లిపోతున్నారు. సాయంత్రం 6 గంటలు దాటితే తుంగభద్ర, హంద్రీ, వక్కెరువాగు నదులు సహా కేసీ కాలువల్లో గుర్రపుడెక్క పెరిగిపోవడంతో ప్రమాదకరమైన దోమలు పెరిగిపోయాయి. ముఖ్యంగా మాన్సోనియా, క్యూలెక్స్ వంటి దోమలు ఊహించని స్థాయిలో వృద్ధి చెందాయి. వీటికితోడు చెత్తా చెదారం నిండిపోయిన మురుగు కాల్వల నుంచి, చెత్త కుప్పల మీది నుంచి గుంపులు గుంపులుగా దోమలు ప్రజలపై దాడి చేస్తున్నాయి. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నారు. ఇండ్లలో ఉండాలన్నా దోమల బెడదే. ఇప్పటికే 146 మంది డెంగీ భారిన పడ్డారు. 25కు పైగా మలేరియా కేసులు నమోదు అయ్యాయని అంటున్నారు. అనధికారికంగా డెంగీ కేసులు నాలుగు రెట్లు అధికంగా ఉంటాయని అంచనా. క్యూలెక్స్ దోమ కాటు వల్ల 1-14 ఏళ్ల మధ్య పిల్లలకు మెదడు వాపు వ్యాధి సోకే ప్రమాదం ఉంది. అయితే.. ఒక్క కేసు కూడా నమోదు కాలేదని అధికారులు పేర్కొన్నారు. దోమ కాటుతో శరీరం దొద్దర్లు ఎక్కి ఇబ్బంది పడుతున్న వారు వేలల్లో ఉంటారు.



### అధికారుల నిర్లక్ష్యం.. ప్రజలకు శాపం

దోమ జీవిత కాలం 25-30 రోజులు. లార్వా దశలోనే అంతం చేయాలి. అంటే.. నవంబరు, డిసెంబరు నెలల్లో దోమలు వృద్ధి చెందే ప్రాంతాలను గుర్తించాలి. నగరం మధ్యన, అనుకొని ప్రవహిస్తున్న తుంగభద్ర, హంద్రీ నదులు, వక్కెరువాగు, కేసీ కాలువ మురుగు కూపాలుగా మారి దోమల వ్యాప్తికి నిలయాలయ్యాయి. ముందస్తుగా ఈ ప్రాంతాల్లో గుర్రపు డెక్క తొలగించడం, దోమల లార్వా నిర్మూలనకు యాంటీ లార్వా మందులు పిచికారి చేయడం, మురుగు గుంటలు, కాల్వల్లో ఆయిల్ బాల్స్ వేయడం, మురుగు కాల్వల్లో పైరిథ్రిన్ మందు, అబేట్ ద్రావణం పిచికారీ ఒక ప్రణాళిక ప్రకారం చేసి ఉంటే.. ఈ స్థాయిలో దోమల దండయాత్ర ఉండేది కాదు. కార్పొరేషన్ అధికారులు, పాలకుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. లార్వా దశలో నిర్మూలన చర్యలు చేపట్టకుండా చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా దోమలు మనుషులపై పడి దాడులు చేస్తుంటే కార్పొరేషన్ అధికారులు 'యాంటీ లార్వా ఆపరేషన్' చర్యలకు ఉపక్రమించారు. అది కూడా తూతూ మంత్రంగానే చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

**ఒక మనిషిపై చేస్తున్న ఖర్చు రూ.8లే!**

నగరంలో 20 పార్కుల ఆధునికీకరణ, సుందరీకరణ కోసం రూ.10 కోట్లు ఖర్చు చేశారు. షాపింగ్ కాంప్లెక్స్, ఓపన్ థియేటర్, సీసీ రోడ్డు, డ్రైనేజీల వంటి పనులు సుమారుగా రూ.500 కోట్లతో చేపట్టామని అధికార పార్టీ నాయకులు గొప్పగా చెబుతున్నారు. దీనితోపాటు . ప్రజల ఆరోగ్యంపై కూడా దృష్టి పెట్టాలి. ముఖ్యంగా జనవరి మాసంలో వృద్ధి చెందే దోమల నివారణకు నవంబరు, డిసెంబరు నెలల్లోనే 'యాంటీ లార్వా ఆపరేషన్' చేపట్టాలి. ఆ దిశగా తీసుకున్న చర్యలు నామమాత్రమే. అంతేకాదు.. దోమల నివారణకు ఏటా చేస్తున్న ఖర్చు రూ.50 లక్షలు మించడం లేదు. నగర జనాభా ఆరు లక్షలు పైగానే ఉంది. అంటే.. ప్రజలను జ్వరాల బారిన పడేసి ప్రాణాంతక వ్యాధులను వ్యాప్తి చేసే దోమల నివారణకు ఒక మనిషిపై చేస్తున్న ఖర్చు రూ.8-10 మించడం లేదు. చెత్త పన్ను రూపంలో ప్రతి ఇంటి నుంచి నెలకు రూ.120-150 ప్రకారం ఏడాదికి రూ.1,500 వసులు చేస్తున్న జగన్ ప్రభుత్వం దోమల నివారణపై శ్రద్ధ పెట్టకపోవడం విమర్శలకు తావిస్తున్నది.





### టీడీపీ ప్రభుత్వంలో దోమలపై దండయాత్ర

చంద్రబాబు ప్రభుత్వంలో లార్వా దశలోనే దోమల నిర్మూలనకు ఓ యుద్ధంలా 'దోమలపై దండయాత్ర' పేరిట దోమలు వృద్ధి చెందే వివిధ ప్రాంతాలను గుర్తించి యాంటీ లార్వా పిచికారీ, మురుగు గుంటలు, కాల్వల్లో ఆయిల్ వేయడం, ఫాగింగ్ వంటి పనులు చేపట్టారు. అధికారులు, ప్రజలు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలను భాగస్వామ్యం చేసేవారు. దోమలేంటీ.. దండయాత్ర ఏంటీ..? అంటూ హేళన చేసినవారు ఉన్నారు. తాజాగా నగరంలో దోమల దండయాత్ర చూస్తోంటే ఆనాడు చంద్రబాబు ఎంత ముందు చూపుతో ప్రజల ఆరోగ్యంపై దృష్టి పెట్టారో గుర్తుకు వస్తుంది. అలాంటి ముందు చూపు నేటి పాలకులకు లేదని స్పష్టమవుతోంది.





### డెంగీ, మలేరియా జ్వరాల బారిన పడుతున్నాం

ఇంతగా దోమల బెడదను గతంలో ఎన్నడూ చూడలేదు. పగబట్టిన శత్రుల్లా గుంపులు గుంపులుగా దాడి చేస్తున్నాయి. సాయంత్రం 5-6 గంటలు దాటితే దోమలు బెడద మొదలవుతుంది. మా కాలనీలో ఇప్పటికే చాలా మంది డెంగీ, మలేరియా బారిన పడ్డారు.

- గోవింద్, సాయినాథ్ నగర్, కర్నూలు



### కూర్చున్నా.. నిల్చున్నా దోమలే

ఈ దోమలు ఎక్కడి నుంచి వస్తున్నాయోగాని నిల్చున్నా.. కూర్చున్నా దోమలే. శరీరం అంతా దొద్దర్లు వస్తున్నాయి. రోగాలు బారిన పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. నెల రోజులుగా ఇబ్బంది పడుతున్నా మా ఏరియాలో దోమలు నివారణకు ఏ మందులు పిచికారీ చేయలేదు. కాల్వల్లో మురుగును తొలగించలేదు.

- పద్మావతి, గుత్తి పెట్రోల్ బంక్ ఏరియా, కర్నూలు

### దోమల నివారణ చర్యలు చేపట్టాం

తుంగభద్ర, హంద్రీ నది, కేసీ కాల్వల్లో గుర్రపు డెక్క పెరగడంతో కోటాను కోట్లు దోమలు వృద్ధి చెందిన మాట నిజమే. జనవరి రెండో వారం నుంచి వ్యాప్తి పెరిగింది. గుర్రపు డెక్క తొలగించి యాంటీ లార్వా మందు పిచికారీ చేస్తున్నాం. మురుగు నీటి గుంటల్లో ఆయిల్ బాల్స్ వేస్తున్నాం. 15 ఫాగింగ్ మిషన్లు కొనుగోలు చేశాం. ఈ నాలుగు నెలలు పని చేయడానికి 40 మంది సిబ్బందిని నియమించాం. ఐపో ద్రావణం 60 వేల లీటర్లు కొనుగోలు చేశాం. 146 డెంగీ కేసులు నమోదు అయ్యాయి. దోమల నివారణకు ఏడాదికి రూ.50 లక్షలు వరకు ఖర్చు చేస్తున్నాం.

- వెంకటేశ్వర్లు, సీనియర్ యంటమాలజిస్టు, నగరపాలక సంస్థ, కర్నూలు

# కన్ను పడితే కబ్జా

**ఆదోని రూరల్, ఫిబ్రవరి 11:** విలువైన స్థలాలే టార్గెట్‌గా వైసీపీ నాయకులు రెచ్చిపోతున్నారు. అది ప్రభుత్వం భూమి కావొచ్చు... వివాదాస్పద స్థలమైనా కావొచ్చు.. ఏదైనా సరే అక్కడకు వైసీపీ అనుచరులు వాలిపోతున్నారు. 'అన్న' చెప్పాడంటూ ఎమ్మెల్యేల పేర్లతో ప్రభుత్వ భూములను దర్జాగా కబ్జా చేసేస్తున్నారు. తాజాగా ఇలాంటి ఘటన ఆదోని పట్టణంలో చోటు చేసుకుంది. ఆదోని పట్టణంలోని అమరావతి నగర్‌లో విలువైన స్థలాన్ని వైసీపీకి చెందిన ఓ నాయకుడు కబ్జా చేసినట్లు ఆరోపణలు వెల్లువత్తుతున్నాయి. అమరావతినగర్‌లోని సర్వే నంబర్ 181/2, 182, 345 సర్వే నంబర్లలో పేద ప్రజలకు భూమిని ఇచ్చేందుకు 2004 సంవత్సరంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం 2008లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి రాజీవ్ గృహ కల్ప పథకంలో భాగంగా ఐదు అపార్ట్‌మెంట్లను ప్రారంభించారు. అయితే దాని పక్కనే రెండు ఎకరాలకు పైగా పేదలకు ఇవ్వాల్సిన ప్రభుత్వం స్థలం ఉంది. వాటిలో పిచ్చిమొక్కలు, కంపచెట్లు పెరిగాయి. ఈ ఖాళీ స్థలంలో ముళ్లకంపలు ఉండడంతో మున్సిపల్ అధికారులు నాలుగు నెలల క్రితం శుభ్రం చేయించి మొక్కలను నాటారు. ఆ ఖాళీ స్థలంలో సదరు సైట్‌కు సంబంధించిన లే అవుట్ బోర్డు కూడ అప్పట్లో ఏర్పాటు చేశారు. సరిగ్గా ఇదే స్థలంలో ఆలూరు మండలం మొలగవల్లి గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు ఎర్రిస్వామి ఆగమేఘాలపై వచ్చి సెంటున్నర చొప్పున 66 ప్లాట్లను వేసి, రాళ్లను కూడా పాతినట్లు స్థానికుల ద్వారా సమాచారం. తమను నమ్మించి ముందుగా ఖాళీ స్థలంలో అధికార బలంతో చెట్లను నాటించి తరువాత కబ్జా చేసి ఎర్రిస్వామి ప్లాట్లు వేసుకొని తన అనుచరులకు కట్టబెట్టడంతోపాటు ఇతరులకు అమ్ముకుంటున్నారని స్థానికులు వాపోయారు. ఇదివరకే ఇల్లు లేని వారికి ప్రభుత్వం వైఎస్సార్ కాలనీలో ప్లాట్లు మంజూరు చేసిందని, మరీ ఏ అధికారంతో ప్రభుత్వ మున్సిపల్ స్థలంలో ప్లాట్లు వేశాడో అంతు చిక్కడం లేదు.



అమరావతి నగర్ మున్సిపల్ స్థలంలో ప్లాట్లు వేసి రాళ్లను నాటిన వైసీపీ నాయకుడు ఎర్రిస్వామి

- ప్రభుత్వ స్థలంపై వైసీపీ నాయకుడి పాగా
- పార్కు స్థలంలో 66 ప్లాట్లు
- గతంలో పేదలకు ఇవ్వాలని ప్రభుత్వ నిర్ణయం
- ఆదోనిలో ప్రభుత్వ భూమి పరులపాలు

### పార్కు అని నమ్మించి ప్లాట్లు వేశాడు

అమరావతి నగర్‌లో రాజీవ్ గృహకల్ప భవనాల పక్కన ఖాళీ ప్రభుత్వ స్థలంలో పార్కు ఏర్పాటు చేస్తామని ఎర్రిస్వామి స్థానికులను నమ్మించి చెట్లను నాటించాడు. నెల రోజుల క్రితం తన మనుషులతో నాటిన మొక్కల స్థానంలో ఒకటిన్నర సెంట్ చొప్పున 66 ప్లాట్లు వేశాడు. ఆ ప్లాట్లను అమ్ముకొని భూ కబ్జాలకు పాల్పడుతున్నాడు. అధికారులు తక్షణమే స్పందించాలి. పార్కులో ప్లాట్ల కోసం నాటిన రాళ్లను తొలగించి స్థానికుల కోసం పార్కును ఏర్పాటు చేయాలి. రెవెన్యూ అధికారులు కూడా ఈ ఖాళీ స్థలంలో వేసిన ప్లాట్లకు పట్టాలు ఇవ్వకూడదు.

- మధు, అమరావతినగర్, ఆదోని

### మొక్కలు నాటించామంతే...

రాజీవ్ గృహకల్ప భవనాల సమీపంలో ఉన్న ఓపెన్ సైట్‌లో నాలుగు నెలల క్రితం మొక్కలు నాటించాం. అందులో ప్లాట్లు వేసి రాళ్లను నాటిన విషయం నా దృష్టికి రాలేదు. విచారించి చర్యలు తీసుకోవడంతోపాటు తమ మున్సిపాలిటీ స్థలం కబ్జా కాకుండా చూస్తాం.

- రఘునాథ్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్, ఆదోని

### ఆర్‌ఐని పంపి విచారిస్తా

అమరావతి నగర్‌లోని ప్రభుత్వ స్థలంలో ప్లాట్లు వేసిన విషయం నాకు తెలియదు. ఆర్‌ఐని పంపించి విచారిస్తాం. స్థలం కబ్జాకు కాకుండా చర్యలు తీసుకుంటాం.

- హసీనా సుల్తాన, తహసీల్దారు, ఆదోని

# మార్గదర్శకులను ఎన్నుకోండి

- ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జి.భవానీ ప్రసాద్
- కర్నూలులో 'ఓటు వేద్దాం.. ప్రజాస్వామ్య పరిరక్షణ' సమావేశం
- అభిప్రాయాలను వెల్లడించిన మేధావులు




సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ జి.భవానీ ప్రసాద్

**కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 11:** ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికల్లో సుపరిపాలన అందించే మార్గదర్శకుల ను ఎన్నుకునే విధంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ చైర్మన్, ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జి.భవానీ ప్రసాద్ అన్నారు. కర్నూలు నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం 'ఓటు వేద్దాం.. ప్రజాస్వామ్య పరిరక్షణ' సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి గాడిచర్ల సర్వోత్తమరావు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కల్కూర చంద్రశేఖర్ తెలంగాణ రాష్ట్ర మాజీ సీఈసీ వి.నాగిరెడ్డి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ చీఫ్ సెక్రటరీ, డెమోక్రసీ ఉపాధ్యక్షుడు ఎల్వీ సుబ్రహ్మణ్యం, ఏపీ మాజీ సీఈసీ, డెమోక్రసీ ప్రధాన కార్యదర్శి నిమ్మగడ్డ రమేష్‌కుమార్, ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి పోలంకి సుబ్బారాయన్ తదితర ముఖ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ జి.భవానీ ప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో మంచితనం తగ్గిపోయిందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ నైతికంగా పతనం అవుతోందన్న విషయాన్ని ఓటర్లు ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. వ్యవస్థలు బాగుండాలంటే నాయకుల తీరును ప్రజలు గమనించాలన్నారు. సమాజం ఎటుపోతుందో అనే భావన నుంచి మేల్కొని ప్రజాస్వామ్యాన్ని ఓటు ద్వారా రక్షించాలన్నారు. కర్నూలు జిల్లా నుంచి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి, దామోదరం సంజీవయ్య, ఎ.చక్రపాణి, కేటీ. నర్సయ్య వంటి మహనీయులు చట్టసభలకు వెళ్లి మంచి పాలన అందించారన్నారు. కానీ ప్రస్తుతం ప్రజలకు మంచి పాలన అందించాలనే ఆలోచన ఏ నాయకుడికి రావడం లేదన్నారు.

వివరాలు 7లో

# అదంతా అవాస్తవం

- అర్చకుల పర్యవేక్షణలోనే ప్రసాదాల తయారీ
- శ్రీశైలం అమ్మవారి ఆలయ ప్రధానార్చకులు

**శ్రీశైలం, ఫిబ్రవరి 11:** శ్రీశైల భ్రమరాంబికాదేవి అమ్మవారి ప్రసాదంలో ఎముక వచ్చినట్లు వస్తున్న వార్తలన్నీ అవాస్తవాలని అమ్మవారి ఆలయ ప్రధానార్చకులు మార్కండేయశాస్త్రి, వేదపండితులు గంటి రాధాకృష్ణ శర్మ వెల్లడించారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ... పాకశాలలో తయారు చేసే రోజూవారి ప్రసాదాలు నియమనిష్ఠలతో, శుచీశుభ్రతలతో ప్రధానార్చకుల పర్యవేక్షణలో జరుగుతాయన్నారు. అమ్మవారి ఆలయ ఆలయ ప్రాంగణంలో గల పాకశాలలో పులిహోర ప్రసాదంలో ఎముక వచ్చిందనేది వాస్తవం కాదన్నారు. ఈ ఘటన తమకు ఎంతో మనోవేదనకు గురి చేసిందన్నారు. దీనిపై పలు అనుమానాలు కూడా ఉన్నాయన్నారు. శ్రీశైలక్షేత్ర ప్రతిష్ఠను దెబ్బతీసి భక్తుల మనోభావాలను కించపరిచేందుకే ఇలాంటి వార్తలు వస్తున్నాయన్నారు. ఇలాంటి ఘటనలపై భక్తులు సమన్వయంతో వ్యవహరించాలని కోరారు.



వేదపండితులు గంటి రాధకృష్ణ శర్మ అవధాని, అమ్మవారి ఆలయ ప్రధానార్చకులు మార్కండేయ శాస్త్రి

# సుపరిపాలకులను ఎన్నుకోండి


‘ఓటు వేద్దాం.. ప్రజాస్వామ్య పరిరక్షణ’ సమావేశంలో మేధావులు, ప్రముఖులు

ఈ సదస్సులో డెమోక్రసి కోశాధికారి ఫాల్గునకుమార్, రిటైర్డ్ ఐఏఎస్ రాంశంకర్‌నాయక్, ఐఆర్ఎస్ రఘు, కేవీ సుబ్బారెడ్డి విద్యాసంస్థల అధినేత కేవీ సుబ్బారెడ్డి, లోక్‌సత్తా పార్టీ నాయకులు ఎల్లయ్య, ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటరామరాజు, లయన్స్ క్లబ్ కార్యదర్శి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

### ఓటర్లలో సరళీకృతమైన ఆలోచనలు ఉండాలి



ప్రతి ఓటరు సరళీకృతమై ఆలోచన ఉంటేనే ప్రజాస్వామ్య వ్యవస్థ అభివృద్ధి చెందుతుంది. ఓటర్లలో గుణాత్మక మార్పులు తీసుకువచ్చేందుకు సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఇతర సంస్థలతో కలిసి రాజకీయాలకు అతీతంగా పనిచేస్తోంది. ఓటు వేసినప్పుడు మాత్రమే సుపరిపాలన కావాలని అడిగే నైతికహక్కు వస్తుంది. ఓటు వేయకపోతే ప్రశ్నించే హక్కు కోల్పోతారు. విద్యాధికులు తమ పౌర బాధ్యతలను నెరవేర్చడంలో మిగిలిన వారిక కంటే ముందు నిలబడాలి. ప్రస్తుత పాలకులు అందరూ కలెక్టర్, ఎస్పీని ఏ విధంగా ఇబ్బంది పెట్టాలి..? తుంగభద్ర నదిలో ఎంత ఇసుకను తోడుకోవాలి, బావమరిది, బంధువులకు ఎంత దోచిపెట్టాలనే దాని మీదనే దృష్టి పెట్టారు. ఓ మంత్రి శాసనసభలో ప్రవేశపెట్టిన చట్టం వల్ల ఏ జిల్లాకు నష్టం కలుగుతుందో కూడా తెలియని దుస్థితిలో నేతలు ఉన్నారు. 37 ఏళ్ల సర్వీసులో సుమారు 200 మంది ఎమ్మెల్యేలతో మాట్లాడాను. గుంటూరు వాసి వావిలాల గోపాలకృష్ణ ఎమ్మెల్యేగా ఎన్నో సేవలందించారు. ఆయన చనిపోయే సమయంలో నాకు ఫోన్ చేసి ఆల్‌మట్టి డ్యాంకు సంబంధించి ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం అలాంటి నాయకులు ఎక్కడ కనిపించలేదు. ఇటీవల లాయర్లను ఇబ్బంది పెట్టే జీవోను తీసుకువచ్చారు. దాని గురించి అడిగితే మంత్రి తనకేమి తెలియదంటూ సమాధానం ఇచ్చారు. పనికిరాని వారిని నెత్తిన పెట్టుకున్నాం. రిటైర్డ్ అయిన ఐఏఎస్ అధికారులపై చార్జిషీటు దాఖలు చేసే దుస్థితికి మన రాష్ట్రం వచ్చింది. ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టాలకు వ్యతిరేకంగా కోర్టును ఆశ్రయిస్తే కోర్టు కూడా ప్రభుత్వ తీరును ఎండగడుతూ తీర్పు ఇస్తుంది. కొందరు ధనవంతులు కావడానికే రాజకీయాల్లోకి వస్తున్నారు. అలాంటి వారిని ప్రశ్నించే విధంగా ఓటర్లు చైతన్యవంతులు కావాలి.

**- ఎల్వీ సుబ్రహ్మణ్యం, మాజీ సీఎస్**

### ఓటర్లందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి



రాష్ట్రంలో సుపరిపాలన కోరుకునే ఓటర్లు విధిగా ఓటు హక్కు వినియోగించుకోవాలి. పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ తక్కువగా నమోదు కావడం బాధాకరం. ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు పౌర సమాజ సంస్థలు గట్టిగా కృషి చేయాలి. ప్రజా జీవితంలో గుణాత్మక మార్పులు తీసుకువచ్చేందుకు సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఇతర సంస్థలతో కలిసి రాజకీయాలకు అతీతంగా చేస్తున్న కృషికి ప్రతి ఒక్కరూ సహకరించాలి. ప్రపంచంలో ఒకప్పుడు ఆర్థికపరంగా బాగున్న వెనిజులా దేశంలో నేడు ఆర్థికవ్యవస్థ పూర్తిగా పతనమైంది. విద్యావంతులు ఓటును వినియోగించుకోకపోవడం వల్లే అక్కడ ఆ పరిస్థితి ఏర్పడింది. కొందరు పార్టీని చూసి, మరికొందరు వ్యక్తిని చూసి, మరి కొందరు డబ్బు, మద్యానికి బానిసలై ఓటు వేస్తున్నారు. ఇకపై అలా ఉండకూడదు. ఎన్నుకున్న ఎమ్మెల్యే, ఎంపీ మన నియోజవర్గానికి ఏమి చేశారో ప్రశ్నించే తత్వం ప్రతి ఒక్కరిలోనూ రావాలి.

**- వి.నాగిరెడ్డి, తెలంగాణ రాష్ట్ర మాజీ ఎస్ఈసీ**

### ఓటు హక్కు ఎంతో విలువైనది



ఓటు హక్కు ఎంతో విలువైనది. ఇటీవల సుప్రీంకోర్టులో ఓటు హక్కును ప్రాథమిక హక్కుగా గుర్తించాలని సుదీర్ఘ వాదనలు జరిగాయి. న్యాయవాది జస్టిస్ కస్తోగి ఓ అడుగు ముందుకేసి ఓటు హక్కు ప్రాథమిక హక్కుగానేకాకుండా ప్రాథమిక బాధ్యతగా తీసుకురావాలని కోరారు. ఉపాధ్యాయులను ఎన్నికల విధులకు తీసుకోకూడదని రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. అయితే దాని మీద ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో ఇటీవల ఉపాధ్యాయుల ఎన్నికల విధుల్లో పాల్గొనేందుకు కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల నిబంధనలకు ఉల్లంఘన జరిగితే డెమోక్రసీ తరపున ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేస్తున్నాం. దీని కోసం ఎన్నికల కమిషన్ ఎంతగా ప్రయత్నిస్తున్నప్పటికీ పట్టణ ప్రాంతాల్లో విద్యావంతులు ఓటింగ్‌కు వెళ్లకపోవడం బాధాకరం. పౌరులంతా తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలి. ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు అన్ని జిల్లాల్లో సదస్సులు నిర్వహిస్తున్నాం.

**- నిమ్మగడ్డ రమేష్‌కుమార్, మాజీ ఎస్ఈసీ**

### బుల్లెట్ కంటే పవర్‌ఫుల్ బ్యాలెట్



బుల్లెట్ కంటే పవర్‌ఫుల్ బ్యాలెట్. నిరక్షరాస్యుల వల్ల ప్రజాస్వామ్యానికి చెడ్డపేరు వస్తుందని చెబుతున్నారు. అది చాలా తప్పు ఓటు వినియోగించుకోని అక్షరాస్యుల వల్ల సమాజంలో విలువలు లేకుండా పోతున్నాయి. ఓటు వేయని వారికి ప్రశ్నించే అధికారం లేదు. గాంధీజి కలలుగన్న గ్రామస్వరాజ్యాన్ని స్థాపించడానికి కృషి చేయాలి. బ్రిటీష్ ప్రభుత్వం గ్రామ,మున్సిపాలిటీలకు ఇచ్చిన చట్టాలు ప్రస్తుతం ప్రభుత్వాలు ఇవ్వడం లేదు.

**- కల్కూర చంద్రశేఖర్**

### బడ్జెట్‌ను ప్రభావితం చేసేదే ఓటు హక్కు



కేంద్ర రాష్ట్రాల్లో ప్రవేశపెట్టే కోట్ల బడ్జెట్‌ను ప్రభావితం చేసే విధంగా ఓటు హక్కు ఉంటుంది. ఓటు విలువ ఎన్ని లక్షలు ఉంటుందో ఎవరికి తెలియదు. ఒక్క ఓటుతో ఎమ్మెల్యే ముఖ్యమంత్రిగా, పార్లమెంటు సభ్యుడు ప్రధానమంత్రిగా కావచ్చు. ప్రతి ఓటరు ఎలాంటి వ్యక్తిని ఎన్నుకోవాలో ఆలోచించుకోవాలి. కళాశాలల్లో ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించాలి. ప్రభుత్వాలు క్రీడలు జరిపేటప్పుడు ఖచ్చితంగా ఓటరు కార్డు ఉంటేనే క్రీడల్లో పాల్గొనాలని నిర్దేశించాలి. ఓటు హక్కు అనేది ప్రతి ఒక్కరి బాధ్యత

**- సుబ్బరంగయ్య, లెట్అస్ ఓటు సంస్థ వ్యవస్థాపకుడు**

### ఓటర్లను చైతన్యవంతులను చేస్తాం



ఓటు వినియోగంతో ఉత్తమ ప్రజాస్వామ్యాన్ని నెలక్పొవచ్చు. గ్రామ,గ్రామాల్లో ఓటర్లను చైతన్యవంతులు చేసేందుకు కృషి చేస్తాం. ఇప్పటి వరకు మా పొదుపు సంఘం ప్రజాస్వామ్య వ్యవస్థ గురించి ప్రస్తావించలేదు. ఓటు విలువలపై ప్రతి గ్రామంలో కళాజాత బృందాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్తాము. గ్రామ గ్రామాన వెళ్లి ఓటు ఆవశ్యకతను వివరిస్తాం.

**- విజయభారతి, ఓర్వకల్లు**

## ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రారంభం

**తొలిరోజు 187 మంది గైర్హాజరు**

**కర్నూలు(ఎడ్యుకేషన్)ఫిబ్రవరి 11:** ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం జనరల్ కోర్సు సైన్స్ ప్రయోగ(ప్రాక్టికల్స్) పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 92 కేంద్రాల్లో పరీక్షలు కొనసాగాయి. ఈ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో సెషన్స్ మధ్యాహ్నం 2నుంచి, సాయంత్ర 5 గంటల వరకు జరిగాయి. మొత్తం విద్యార్థులు 6,243 మందికిగాను, 6,056 మంది హాజరు కాగా, తొలిరోజు 187 మంది గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన పరీక్షలకు 3,444 మందికిగాను 3,339 మంది హాజరుకాగా, 105 మంది గైర్హాజరయ్యారు, అలాగే మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 2,799 మందికిగాను, 2,717 మంది హాజరుకాగా, 82 మంది గైర్హాజరైనట్లు ఆర్ఐఓ గురువయ్యశెట్టి వెల్లడించారు. పరీక్షలను డీవీఈవో జమీర్ పాషా, డీఈసీ సభ్యులు పరమేశ్వర రెడ్డి, జి.లాలెప్ప, ప్రభు పర్యవేక్షించారు.

### ఇద్దరు ఎస్ఐలకు స్థానచలనం

**కర్నూలు, ఫిబ్రవరి 11:** ఉమ్మడి కర్నూలు జిల్లాలో పని చేస్తున్న ఇద్దరు ఎస్ఐలకు పోలీసు ఉన్నతాధికారులు స్థానచలనం కల్పించారు. ఆత్మకూరు పోలీస్‌స్టేషన్ పని చేస్తున్న కృష్ణమూర్తిని మాధవరం పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న ఎస్ఐ కిరణ్‌బాబును నంద్యాల జిల్లా అవుకు పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు.

### ఆ కార్పొరేటర్‌పై మరో కేసు నమోదు

**కర్నూలు, ఫిబ్రవరి 11:** కర్నూలు పరిధిలోని శరీన్‌నగర్ కార్పొరేటర్ జయరామ్, ఆయన సోదరులు, తండ్రిపై ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం మరో కేసు నమోదైంది. మూడు రోజుల క్రితం రౌడీ షీటర్ ప్రభాస్ అలియాస్ గర్జి మీద కార్పొరేటర్ జయరామ్ ఆయన సోదరులు దాడి చేశారు. దీంతో ప్రభాస్ తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఆదివారం తనపై వారు దాడి చేయలేదంటూ ప్రభాస్‌తో కొంతమంది బలవంతంగా మీడియాతో స్టేట్‌మెంట్ ఇప్పించారు. తర్వాత కొద్దిసేపటికే ప్రభాస్ మరోసారి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సంజన్న, అతని కుమారులు తనను బలవంతంగా కిడ్నాప్ చేసి బలవంతంగా వీడియో చిత్రీకరించినట్లు ఫిర్యాదు చేశాడు. ప్రభాస్ ఫిర్యాదు మేరకు సంజన్న, ఆయన కుమారులు జయరామ్, కరుణాకర్, అఖిలతో పాటు మరి కొంత మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. గత వైసీపీలో కీలకంగా ఉంటున్న సంజన్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డికి ముఖ్య అనుచరుడిగా ఉన్నారు. అయితే సంజన్న టీడీపీలో చేరుతున్నట్లుగా వార్తలు వస్తున్న తరుణంలో వరుస కేసులు నమోదు చేయిస్తున్నట్లు నగరంలో చర్చనీయాంశంగా మారింది.

### ‘దిశా’ డీఎస్పీగా బాబు ప్రసాద్ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరించిన దిశా డీఎస్పీగా బాబు ప్రసాద్

**కర్నూలు, ఫిబ్రవరి 11:** దిశా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా బాబు ప్రసాద్ ఆదివారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు జిల్లా దిశా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా పని చేస్తూ ఇటీవలే కర్నూలు ఆయన బదిలీ అయ్యారు. బాబు ప్రసాద్ సీఐగా కర్నూలు టూటౌన్, ఆత్మకూరు, కర్నూలు స్పెషల్ బ్రాంచ్, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో పని చేశారు. డీఎస్పీగా కర్నూలు స్పెషల్ బ్రాంచ్, నెల్లూరు జిల్లా గూడూరు పోలీస్‌స్టేషన్‌లో పని చేశారు. శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా తాను పనిచేస్తానని బాబు ప్రసాద్ వెల్లడించారు.

### మల్లన్న సన్నిధిలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి


ఆలయ ప్రాంగణంలో జస్టిస్ ఇందిరేష్

**శ్రీశైలం, ఫిబ్రవరి 11:** శ్రీశైల మల్లికార్జున స్వామి, భ్రమరాంబ అమ్మవార్లను ఆదివారం రాత్రి కర్ణాటక రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఇందిరేష్ దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న న్యాయమూర్తికి ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తి స్వామికి అభిషేకం నిర్వహించారు. ఆ తర్వాత భ్రమరాంబికాదేవిని దర్శించుకున్నారు. దర్శనానంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో వేదపండితులు జడ్జికి వేదాశీర్వచనం పలికి తీర్థప్రసాదాలను అందజేశారు.

## ఓపీఎస్‌ను సాధించి తీరుతాం

- యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు
- కర్నూలులో ప్రారంభమైన స్వర్ణోత్సవాలు


జి.పుల్లయ్యను సన్మానిస్తున్న యుటీఎఫ్ నాయకులు


మాట్లాడుతున్న నక్క వెంకటేశ్వర్లు

**కర్నూలు (ఎడ్యుకేషన్) ఫిబ్రవరి 11:** ప్రభుత్వం మెడలు వంచి ఓపీఎస్‌ను సాధించుకుంటామని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. యూటీఎఫ్‌లో కొనసాగుతూ అమరులైన కుటుంబాలకు సంఘం అండగా నిలుస్తుందన్నారు. ఆదివారం నగరంలోని సిల్వర్ జూబ్లీ కళాశాలలో యూటీఎఫ్ స్వర్ణోత్సవ కార్యక్రమాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా స్వర్ణోత్సవ లోగోను ఆవిష్కరించి ఎస్‌టీఎఫ్ఐ పతాకాన్ని నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ సంఘం తొలి జిల్లా ప్రధాన కార్యదర్శి రవీంద్ర విద్యాసంస్థ అధినేత జి.పుల్లయ్య మాట్లాడుతూ అంకితతత్వం, ఉద్యమ స్ఫూర్తి ఒక్క యూటీఎఫ్‌కే సాధ్యమన్నారు. పోరాటాలతోనే ఉపాధ్యాయుల ప్రయోజనాలు వస్తాయన్నారు. రాష్ట్ర సహాధ్యక్షుడు కందుకూరి సురేష్ కుమార్ మాట్లాడుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో స్వర్ణోత్సవాలు ఏడాదంతా రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతాయన్నారు. సభలో సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ రచించిన స్వర్ణోత్సవ సంబరాల గేయాన్ని ప్రజానాట్యమండలి సీనియర్ నాయకులు బసవరాజు ఆలపించారు. యూటీఎఫ్‌లో నాయకత్వ బాధ్యతలు నిర్వర్తించిన వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ గౌరవాధ్యక్షుడు నరసింహులు, కోడుమూరు మాజీ ఎంఈవో నాగభూషణం శెట్టి, జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్, నాయకులు నాగమణి, ఎల్లప్ప, సుధాకర్, రామాంజనేయులు, జేవీవీ సుధీర్ రాజు, ఎస్ఎం జయరాజు, యేహోషువా తదితరలు పాల్గొన్నారు.

## ప్రసూతి వార్డులో అవస్థలు

- చీకట్లో మగ్గిన చిన్నారులు, బాలింతలు
- కోసిగి ప్రభుత్వాసుపత్రిలో కరెంటు కోత
- ట్రాన్స్‌ఫార్మర్‌లో సాంకేతిక లోపం


కోసిగిలో చీకట్లో ప్రసూతి వార్డు

**కోసిగి, ఫిబ్రవరి 11:** కోసిగి ప్రభుత్వాసుపత్రిలో కరెంటు లేక పసిబిడ్డలు, బాలింతలు శనివారం రాత్రి 11 గంటల తర్వాత తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. బాలింతలు, గర్భిణులు కరెంటు లేక ఆసుపత్రుల్లో చీకట్లోనే సతమతమయ్యారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం రాత్రి ట్రాన్స్‌పార్మర్‌లో సాంకేతిక లోపంతో ఆసుపత్రిలోని వైరింగ్ కాలిపోయింది. దీంతో సుమారు 5 గంటల పాటు గర్భిణులు, బాలింతలు అల్లాడిపోయారు. అప్పుడే పుట్టిన శిశువులకు ఫ్యాన్లు తిరగకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. బంధువులు సెల్ టార్చులైటు వెలుతురులో చీర కొంగుతో ఊపుతూ పసిబిడ్డలకు గాలి పట్టారు. అప్పుడే పుట్టిన శిశువులు, బాలింతల బాధ వర్ణణాతీతం. కాన్పు అయిన గంటకే బాలింతలను రాత్రి 11 గంటల సమయంలో తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనంలో ఇంటికి పంపించేశారు. ఈ విషయంపై వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌కుమార్‌ను వివరణ కోరగా... ఆసుపత్రి సమీపంలో ఉన్న ట్రాన్స్‌పార్మర్‌పై కోతి పడడంతో ఆసుపత్రిలోని వైరింగ్ కాలిపోయిందన్నారు. విద్యుత్ అధికారులు వచ్చినప్పటికి సమస్య పరిష్కారం కాలేదని, అందుకే గర్భిణులు, బాలింతలను ఇంటికి పంపించామన్నారు.

## కల్యాణవేదికపై రక్తదానం

- ఆదర్శంగా నిలిచిన వరుడు
- తనతో పాటు 20 మంది స్నేహితులు కూడా


వధూవరులు వెంకట హరీష్, అనూష

**మహానంది, ఫిబ్రవరి 11:** రక్తదానం చేయాలంటూ నిత్యం ఎవరో ఒకరు వివిధ రూపాల్లో అవగాహన కల్పిస్తుంటారు. కానీ నంద్యాల జిల్లా మహానందిలో మాత్రం ఓ యువకుడు విభిన్నంగా ఆలోచించాడు. ఏకంగా తన పెళ్లిరోజున కల్యాణవేదికపై ఏకంగా రక్తదానం చేసి అందర్నీ ఆశ్చర్యపరిచాడు. అంతేకాదు తన 20 మంది స్నేహితులతో కూడా రక్తదానం చేయించి ఆదర్శంగా నిలిచాడు. మహానంది మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన తెలుగు వెంకట హరీష్, ప్రకాశం జిల్లా రాచర్ల గ్రామానికి చెందిన అనూషకు ఆదివారం మహానందిలో వివాహం జరిగింది. అయితే తన వివాహ వేడుకల్లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయాలని వరుడు హరీష్ ముందుగానే నిర్ణయించుకుని అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేశాడు. వివాహం తంతు పూర్తయ్యాక మొదటగా తనే రక్తదానం చేశాడు. తర్వాత తన 20 మంది స్నేహితులతో రక్తదానం ఇప్పించాడు. సేకరించిన రక్తం శాంపిళ్లను వైద్య సిబ్బంది నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గతంలో కూడా వెంకట హరీష్ క్యాన్సర్ పేషేంట్ల కోసం తన వెంట్రుకలను 12 సెంటిమీటర్లు పెంచి కేశదానం చేశాడు. తమ వివాహం రోజున ప్రజలకు ఉపయోగపడేలా ఏదైనా కార్యక్రమం చేయాలన్న లక్ష్యంతోనే ఇలా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయించినట్లు హరీష్ దంపతులు తెలిపారు.


కల్యాణ మండపంలో రక్తదానం చేస్తున్న హరీష్ స్నేహితులు

### వివాహిత ఆత్మహత్య

**క్రిష్ణగిరి, ఫిబ్రవరి 11:** అత్తింటి వేధింపులు భరించలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని రామకృష్ణాపురంలో ఆదివారం చోటు చేసుకుంది. రామకృష్ణాపురం గ్రామానికి చెందిన మానస(27) ఆదివారం పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపిన మేరకు వివరాలు ఇలా... ఓర్వకల్లు మండలం బ్రాహ్మణపల్లికి చెందిన మానసకు రామకృష్ణాపురం గ్రామానికి చెందిన గంగాధర్‌తో ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు సంతానం. అయితే గత కొంతకాలంగా మానసను అదనపు కట్నం కోసం భర్త గంగాధర్, కుటుంబ సభ్యులు వేధించేవారు. సూటిపోటి మాటలతో ఆమెను మానసికంగా ఇబ్బందులకు గురి చేశారు. దీంతో జీవితంపై విరక్తి చెందిన మానస శనివారం రాత్రి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గుర్తించిన కుటుంబ సభ్యులు ఆమెను కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మానస ఆదివారం మృతి చెందింది. ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు భర్త గంగాధర్‌తో పాటు కుటుంబ సభ్యులు రామచంద్ర, నాగరత్నమ్మ, రమేష్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

### మనస్తాపంతో మహిళ బలవన్మరణం

**దేవనకొండ, ఫిబ్రవరి 11:** మండల కేంద్రంలోని దేవనకొండ టర్నింగ్‌లో నివాసం ఉంటున్న ఉప్పరి లక్ష్మి(30) అనే మహిళ మనస్తాపంతో ఆదివారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. భర్త ఉప్పరి క్రిష్ణ గ్రానైట్‌బండలు పరిచే పని నిమిత్తం రెండు రోజులు క్రితం పనికి వెళ్లాడు. ఇంట్లో తన ఇద్దరు కుమారులతో ఉన్న లక్ష్మి తెల్లవారుజామున ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. ఈక్రమంలో శబ్దం రావడంతో పిల్లలు లేచి చుసేసరికి ఫ్యాన్‌కు లక్ష్మి వేలాడుతూ కనిపించింది. చిన్నారులు చుట్టుపక్కల వారిని పిలుచుకువచ్చేలోగా ఆమె మృతి చెందింది. కొంత కాలంగా లక్ష్మి తల,కడుపు నొప్పితో బాధపడుతూ ఉండేదని భర్త కేశన్న తెలిపాడు. ఎన్నో ఆసుపత్రులకు వెళ్లినా ఆమె ఆరోగ్యం కుదుటపడలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

## ధర్నాను జయప్రదం చేయండి



ఓర్వకల్లులో కరపత్రాలు విడుదల చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

**ఓర్వకల్లు, ఫిబ్రవరి 11:** కరువు సహాయక చర్యలు చేపట్టాలని సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం సహాయ కార్యదర్శి నాగన్న, ఏపీ రైతు సంఘం మండల నాయకులు మధుసూదన్ రైతులకు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని నన్నూరు, ఓర్వకల్లు, తదితర గ్రామాల్లో కరపత్రాల పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించినా నేటికి సహాయ చర్యలు చేపట్టలేదన్నారు. రైతులు, కార్మికులు వ్యవసాయ రంగం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. కరువు సహాయక చర్యలు చేపట్టి ఇన్‌పుట్ సబ్సిడీ ఎకరాకు రూ.20వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీమా నష్టపరిహారం డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. ఉపాధి హామీ పనుల్లో 200 రోజులు పనులు కల్పించి రూ.600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు మునిస్వామి, మల్లేష్, మాసూంబాషా, శ్రీరాములు, దస్తగిరి, వెంకటేశ్వర్లు, మధు, జగన్నాథం, కురువ స్వాములు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలకు అందరూ సహకరించాలి



ఎస్ఐకు సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

**సి.బెళగల్, ఫిబ్రవరి 11:** రెండు నెలల్లో జరిగే ఎన్నికలకు ప్రజలు సహకరించాలని ఎస్ఐ తిమ్మారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని టీడీపీ మాజీ జడ్పీటీసీ చిన్న మునెప్ప, మాజీ సర్పంచులు ఎస్ఐను కలిసి సన్మానించారు. గ్రామాల్లో మద్యం, పేకాట, గుట్కా, మట్కా వంటివి విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో గిడ్డయ్యగౌడు, జయన్న, కర్రెతాత, రాజు తదితరులు ఉన్నారు.

● మండలంలోని ఇనగండ్ల, సిబెళగల్, పోలకల్లు గ్రామాల్లోని రౌడీషీటర్లను ఆదివారం స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో రౌడీషీటర్లు విచ్చలవిడిగా గ్రామాల్లో తిరుగుతూ ప్రజలను భయ భ్రాంతులకు గురిచేస్తే క్షేమించే ప్రసక్తి లేదన్నారు.

## 'సనాతన హిందూ ధర్మాన్ని విశ్వవ్యాప్తం చేయడమే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యం'



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నగరూరు రాఘవేంద్ర

**కర్నూలు (కల్చరల్), ఫిబ్రవరి 11:** సనాతన హిందూ ధర్మాన్ని విశ్వవ్యాప్తం చేయడమే రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) లక్ష్యమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నగరూరు రాఘవేంద్ర అన్నారు. ఆదివారం నగరంలోని నరసింహారెడ్డినగర్‌లో, సంఘ్ పరివార ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో రాఘవేంద్ర మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్ స్వరూప స్వభావాలు ప్రతి ఒక్కరూ అర్థం చేసుకున్నప్పుడే హిందూ జాతిని జాగృతం చేసినవారమవుతామని అన్నారు. హిందూ ధర్మాన్ని పరిరక్షించాలి, హిందూ సమాజంలో ఆత్మవిశ్వాసాన్ని పెంచాలలన్న ఆర్‌ఎస్‌ఎస్ బాటలో అందరూ అనుసరించాలని కోరారు. ఆర్‌ఎస్‌ఎస్ అభిప్రాయాలు, ప్రణాళికలు నిస్వార్థంగా ప్రజాసేవకై ఉంటాయని అన్నారు. ఈ సమావేశంలో కర్నూలు ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు నాగెళ్ల అజయ్‌బాబు, హరికిషన్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరాములు యాదవ్, అధికార ప్రతినిధి రామాంజినేయులు, కర్నూలు మండల అధ్యక్షుడు శ్రీకాంత్ పాల్గొన్నారు.

## మైనార్టీల హక్కులను పరిరక్షించుకుందాం

● ముస్లిం మహాగర్జనలో వక్తల పిలుపు




ముస్లిం గర్జనలో పాల్గొన్న ముస్లిం నాయకులు

**కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 11:** ముస్లిం మైనార్టీల హక్కులను పరిరక్షించుకుందామని రాష్ట్ర ముస్లిం మైనార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని మున్సిపల్ హైస్కూల్ మైదానంలో ముస్లిం మైనార్టీల మహాగర్జన సభ నిర్వహించారు. సోయాబుద్దీన్ ఖాద్రీ, ఎంఎండీ బాషాష, హుసేన్ పీరా, రిటైర్డు జడ్జి నజీర్ అహమ్మద్, రిటైర్డు డీఎస్పీ మహబూబ్‌బాషా, పలువురు ముస్లిం మత పెద్దలు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ముస్లింలు అన్ని రంగాల్లో వివక్షకు గురవుతున్నారని, ముస్లిం మైనార్టీ వర్గాల హక్కుల సాధన కోసం మరో సారి ఉద్యమించక తప్పదన్నారు. దేశ వ్యాప్తంగా అన్యాక్రాంతమైన వక్ఫ్‌బోర్డు ఆస్తులు పరిరక్షణకు ఐక్యమత్యంగా పోరాడుదామన్నారు. రాష్ట్రంలో వక్ఫ్ బోర్డుకు చెందిన సుమారు 66వేల ఎకరాల భూములు ఉండగా, అందులో సగానికి పైగా భూ కబ్జాదారుల కబంద హస్తాల్లో ఉన్నాయన్నారు. కేవలం కర్నూలు జిల్లాలోనే సుమారు 30వేల ఎకరాల భూములు విలువైన స్థలాల అక్రమణకు గురైనట్లు తెలుస్తోందన్నారు. రాజకీయ పార్టీలు ముస్లిం మైనార్టీలను కేవలం ఓటు బ్యాంకు కోసమే వాడుకుంటునారన్నారు. మైనార్టీలకు ఎంపీ, ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వాహనాల రికార్డులను పరిశీలిస్తున్న ఎస్ఐ శ్రీనివాసులు

**గూడూరు, ఫిబ్రవరి 11:** వాహనదారులు ట్రాఫిక్ నియమ నిబంధనలు తప్పక పాటించాలని కె నాగలాపురం ఎస్ఐ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం సల్కాపురం దగ్గర ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు తప్పక హెల్మెట్ ధరించి వాహనాలను నడపాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేసామని హెచ్చరించారు. వాహనదారులు తప్పక ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

# శంఖారావంతో వైసీపీలో వణుకు

● నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్
● నారా లోకేశ్ శంఖారావం విజయవంతం కావాలని కాల్వబుగ్గలో ప్రత్యేక పూజలు



కాల్వబుగ్గలో శివుడికి పూజలు చేస్తున్న నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్

**ఓర్వకల్లు, ఫిబ్రవరి 11:** నారా లోకేశ్ పూరించిన శంఖారావంతో వైసీపీలో వణుకు పుడుతుందని నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. ఆదివారం లోకేశ్ చేపట్టిన శంఖారావం విజయవంతం కావాలని మండలంలోని కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయంలో శివుడికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు జరిపారు. ఆలయ అర్చకులు కల్లెల లక్ష్మీనారాయణ శర్మ, కల్లె లక్ష్మీనరసింహ శర్మ ప్రత్యేక పూజలు చేశారు. మల్లెల రాజశేఖర్ మాట్లాడుతూ నారా లోకేశ్ యువగళం పాదయాత్ర విజయవంతమైందని, ప్రారంభం నుంచి సీఎం జగన్ ఎన్ని ఇబ్బందులు పెట్టినా, కదలకుండా, బెదరకుండా పాదయాత్ర కొనసాగిస్తూ విజయవంతమైందన్నారు. శంకారావం జగన్‌కు నిద్రలేని రాత్రులను మిగులుతుందన్నారు. శంఖారావంతో ప్రజలను కార్యకర్తలను కలుసుకోవడం ద్వారా టీడీపీ మరింత బలోపేతం అయ్యేందుకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మహబూబ్ బాషా, కేవీ మధు, సుధాకర్, రామగోవిందు, బజారు, వేణు, జయకృష్ణ, వలి, తదితరులు పాల్గొన్నారు.

### వైసీపీ అరాచక పాలనకు రోజులు దగ్గరపడ్డాయి..

వైసీపీ అరాచక పాలనకు రోజులు దగ్గరపడ్డాయని టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి అన్నారు. ఆదివారం ఓర్వకల్లులో గోవిందరెడ్డి, నంద్యాల టీడీపీ ఉపాధ్యక్షులు మోహన్ రెడ్డి మాట్లాడుతూ వైసీపీ అరాచకాలు వ్యతిరేకంగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పూరించిన నాదమే శంఖారావమని అన్నారు. నిరుద్యోగ యువత, ధరలు పెరుగుదలతో రాష్ట్ర ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలకు భరోసా కల్పించేందుకే నారా లోకేశ్ శంఖారావం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. రానున్న 50 రోజుల్లో 130 అసెంబ్లీ నియోజకవర్గాల్లో లోకేశ్ పర్యటించనున్నారన్నారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ప్రవేశ పెట్టిన ఆరు పథకాలపై గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలకు అవగాహన కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, అబ్దుల్లా, తదితరులు పాల్గొన్నారు.

### శంఖారావంతో వైసీపీని గద్దె దించుదాం

**కర్నూలు(అర్బన్):** వైసీపీని గద్దె దించి అన్ని వర్గాల ప్రజలను కాపాడుకునేందుకు నారా లోకేష్ శంఖారావమని బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సత్రం రామకృష్ణుడు అన్నారు. ఆదివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ పరిపాలనలో పూర్తిగా వైఫల్యం కావడంతో రాష్ట్ర ప్రజలను, నిరుద్యోగులను, మహిళలను దగా చేసి జగన్ అందరిని మోసం చేశారన్నారు. శంఖారావం కార్యక్రమంతో ప్రజలకు, టీడీపీ కార్యకర్తలకు అండగా ఉండాలని ప్రజల్లోకి వచ్చారని తెలిపారు. కార్యక్రమానికి మొదటి రోజు ప్రజలు బ్రహ్మరథం పట్టారన్నారు. చంద్రబాబు నాయుడు బాబు ష్యూరిటీ... భవిష్యత్ గ్యారెంటీ పేరుతో సూపర్ సిక్స్ పథకాన్న ప్రకటించారని, దాన్ని నారాలోకేశ్ ప్రజల్లో ఇంటింటికి చేరేలా శంఖారావం ద్వారా ప్రజలకు వివరించబోతున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కర్నూలు పార్లమెంట్‌లో ఎంపీ, 7 ఎమ్మెల్యే స్థానాల్లో తెలుగు దేశం పార్టీ విజయ దంకా మోగిస్తుందన్నారు.సమావేశంలో బీసీ నాయకులు ప్రభు యాదవ్, గంగారాం, ఈడిగ ఎల్లాగౌడ్, వాల్మీకి రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు



మాట్లాడుతున్న గోవిందరెడ్డి

# విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి: డీఈవో

**కర్నూలు(ఎడ్యుకేషన్)ఫిబ్రవరి 11:** విద్యార్థులు పరిశోధనల వైపు ఆసక్తిన్ని పెంచుకొని శాస్త్రవేత్తలుగా ఎతగాలని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక శ్రీరామనగర్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమాన్ని డీఈవో ప్రారంభించారు. అనంతరం సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఆయన మాట్లాడుతూ వినూత్నమైన సృజనాత్మకమైన ప్రదర్శనలో ఉత్తమ ప్రాజెక్టలను ప్రదర్శించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో చక్కని ప్రతిభ కనబరిచి కర్నూలు జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని అకాంక్షించారు. విద్యార్థులు తయారుచేసే నూతన ఆవిష్కరణలు దేశాభివృద్ధికి దోహదపడాలన్నారు. అందుకు ఉపాధ్యాయులు తయారు చేసే ప్రాజెక్టలు మేధావులను అలోచింపచేసే విధంగా ఉండాలన్నారు. ఎన్ఐఫ్ రీసెర్స్ అసోషియేట్ అమిత్ జైన్ మాట్లాడుతూ పిల్లల్లో శాస్త్రీయ దృక్పథం, పరిశోధన పట్ల ఆసక్తిని పెంచుకుని తమలోగల సృజనాత్మకత ఆలోచనలతో ప్రాజెక్టులను తయారు చేసి ఉత్తమ ప్రతిభ కనబరచాలని సూచించారు. జిల్లా సైన్స్ అధికారి రంగమ్మ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 131 ప్రాజెక్టులు వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు, గైడ్ టీచర్లు ప్రదర్శించడం జరిగిందన్నారు. అంతకుముందు విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఉర్రూతలూగించాయి. కార్యక్రమంలో కర్నూలు ఉప విద్యాశాఖ అధికారి హనుమంతరావు, మండల విద్యాశాఖ అధికారులు, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, న్యాయ నిర్ణేతలు, అర్గనైజింగ్ కమిటి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీఈవో

### డీఈవోను కలిసిన ఎస్టీయూ నాయకులు

నూతనంగా ఉద్యోగ బాధ్యతలను చేపట్టిన జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూలును ఆదివారం ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం నాయకులు కలిసి అభినందనలు తెలియజేశారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు ఎస్. గొకారి, జిల్లా ప్రధాన కార్యదర్శి టి కె జనార్దన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, ప్రభుత్వం చేపట్టిన వివిధ సంక్షేమ పథకాల అములుకు తమ సంఘం సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. డీఈవోను కలిసిన వారిలో నాయకులు ముదాసిర్, గోవిందు, శ్రీధర్, దేవదాసు, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మహనీయుడు 'ఘంటసాల'

**కర్నూలు (కల్చరల్), ఫిబ్రవరి 11:** తెలుగు పాటకు విశ్వఖ్యాతి తెచ్చిన మహనీయుడు పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు అని విశ్రాంత ఐఏఎస్ అధికారి, ఉమ్మడి జిల్లా మాజీ కలెక్టర్ రామ్‌శంకర్ నాయక్ కొనియాడారు. ఆదివారం ఘంటసాల 50వ వర్ధంతిని నగరంలోని ఘంటసాల గాన కళా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నగరంలో ఇన్‌కమ్ ట్యాక్స్ కార్యాలయం కూడలిలోని ఘంటసాల విగ్రహానికి, విగ్రహం ముందు ఏర్పాటు చేసిన చిత్రపటానికి పుష్పమాలలు వేసి నివాలులు అర్పించారు. కార్యక్రమంలో గాడిచర్ల ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేసీ కల్కూర, హార్ట్ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ పి. చంద్రశేఖర్, ఘంటసాల గాన కళా సమితి అధ్యక్ష కార్యదర్శులు వాసుదేవ మూర్తి, రాఘవేంద్ర ప్రసాద్, కోశాధికారి జగన్నాథ గుప్త, శ్రీరాముడు, గాయకులు ఎలమర్తి రమణయ్య, సుధారాణి, శ్రీనివాస్ తదితరులు పాల్గొని ఘంటసాలకు నివాళులు అర్పించారు.



ఘంటసాల విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ కలెక్టర్ రామ్‌శంకర్‌నాయక్ తదితరులు

### మహిళల జీవనోపాధి కోసం మినీ పౌల్ట్రీ యూనిట్లు

**కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 11:** ఉమ్మడి కర్నూలు జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల మహిళల జీవనోపాధిని మెరుగుపరిచేందుకు ప్రభుత్వం డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో వివిధ పథకాల అమలుకు శ్రీకారం చుట్టిందని డీఆర్‌డీఏ ఐకేపీ ప్రాజెక్టు పీడీ సలీంబాషా ఆదివారం తెలిపారు. నాటు కోళ్ల పెంపకంపై ఆసక్తి చూపే మహిళలకు మినీ పౌల్ట్రీ షెడ్లను డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మంజూరు చేస్తున్నామని తెలిపారు. కర్నూలు జిల్లాలోని క్రిష్ణగిరి, వెల్దుర్తి, కల్లూరు మండలాల్లో 20, క్రిష్ణగిరి మండలంలోని కోవెలకుంట్లలో 4 యూనిట్లు, వెల్దుర్తిలో 3 మినీ పౌల్ట్రీ షెడ్లు ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు.

### విద్యుత్ కార్మికుల అక్రమ అరెస్టులు అన్యాయం'

**కర్నూలు (కల్చరల్), ఫిబ్రవరి 11:** జిల్లాలో విద్యుత్ కార్మికులను అక్రమంగా అరెస్టులు చేయడం అన్యాయమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు అన్నారు. ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కార్మిక సమస్యల పరిష్కారం కోసం సోమవారం విజయవాడలో చేపట్టే ధర్నా కార్యక్రమానికి జిల్లా నుంచి విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు వెళ్తున్నారని ముందస్తుగా అరెస్టు చేశారన్నారు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లోని విద్యుత్ కార్మికులను విధులకు వెళ్లనివ్వకుండా అడ్డుకోవడం, కొందరిని బలవంతంగా స్టేషన్లకు తీసుకువెళ్లడం అమానుషమని అన్నారు.

### కొనసాగుతున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలు



శ్రీవారి సేవలో పాల్గొన్న జస్టిస్ భవానీ ప్రసాద్, ఎల్వీ సుబ్రహ్మణ్యం, నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ తదితరులు

**కర్నూలు (కల్చరల్), ఫిబ్రవరి 11:** నగరంలోని సంకల్‌బాగ్‌లో గల హరిహర క్షేత్రంలో కొనసాగుతున్న శ్రీదేవీ భూదేవీ సమేత వేంకటేశ్వర స్వామి 18వ వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. కాగా ఉత్సవాల్లో రెండో ఆదివారం జరిగిన పూజాది కార్యక్రమాల్లో హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ భవానీ ప్రసాద్, ఏపీ మాజీ ముఖ్య కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మాజీ ఎస్ఈసీలు నిమ్మగడ్డ రమేశ్‌కుమార్, నాగిరెడ్డి, రిటైర్డ్ ఏఐఎస్ రామచంద్ర నాయక్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. వారికి ఆలయ కమిటీ ప్రతినిధులు సాదరంగా ఆహ్వానం పలికారు. ఉత్సవాల్లో ఉదయం స్వామివారికి, అమ్మవార్లకు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, మహా నారాయణ హోమ నిర్వహించారు. సాయంత్రం శ్రీవారు గజవాహనంపై విహరించారు. ఈ కార్యక్రమంలో గాడిచర్ల ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర కల్కూర, నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్ష కార్యదర్శులు కల్లే చంద్రశేఖర శర్మ, హెచ్‌కే రాజశేఖర్, గౌరవ అధ్యక్షుడు హెచ్‌కే రాజశేఖర్, సభ్యులు కేజీ ప్రభాకరరావు, సీవీ దుర్గాప్రసాద్, శివప్రసాద్, మాధవ ప్రభు తదితరులు పాల్గొన్నారు.

### క్రీడల్లో నైపుణ్యం పెంచుకోవాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న టూటౌన్ సీఐ ఇంతియాజ్‌బాషా

**కర్నూలు(స్పోర్ట్స్), ఫిబ్రవరి 11:** క్రీడాకారులు క్రీడల్లో నైపుణ్యం పెంచుకోవాలని టూటౌన్ సీఐ ఇంతియాజ్‌బాషా అన్నారు. ఆదివారం స్థానిక డీఎస్ఏ ఔట్‌డోర్ స్టేడియంలో జరుగుతున్న 13వ హాకీ ఆంధ్రప్రదేశ్ సబ్ జూనియర్ అంతర్ జిల్లా పోటీలల్లో రెండో రోజు క్రీడాకారుల జట్టు కడప జిల్లా, అన్నమయ్య జిల్లాల క్రీడాకారులను ఆయన పరిచయం చేసుకుని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో హాకీ సంఘం దాసరి సుధీర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రవీణ్; సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు గంగాధర్, టోర్నమెంటు డైరెక్టర్ థామస్, పీటర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

**● సెమీస్‌కు చేరిన కర్నూలు బాలుర జట్టు:**

స్థానిక డీఎస్ఏ స్టేడియంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి హాకీ బాలుర చాంపియన్‌షిప్‌లో భాగంగా ఆదివారం జరిగిన క్వార్టర్ ఫైనల్‌లో కర్నూలు జట్టు 1-0 స్కోరుతో నెల్లూరు పై గెలుపొందింది. కర్నూలు జట్టులో రైటింగ్ ఆటగాడు వంశీ తనకు వచ్చిన అవకాశాన్ని గోలుగా మలచడంతో కొనసాగించాడు. ఆట ద్వితీయర్థం చూసేసరికి ఒకటి చిన్న గోలుతో కర్నూలు సెమీస్‌కు బెర్తు దక్కింది. రెండో క్వార్టర్ ఫైనల్‌లో గుంటూరు జట్టు 5-2 గోల్స్‌తో అన్నమయ్య జట్టుపై నెగ్గింది. మూడో క్వార్టర్ ఫైనల్‌లో తిరుపతి జట్టు 2-1 స్కోరుతో అనకాపల్లిపై విజయం సాదించింది.

### క్రీడల్లో రాణించాలి



సీలంబం పోటీలను ప్రారంభిస్తున్న డా.శంకర్‌శర్మ

**కర్నూలు(స్పోర్ట్స్), ఫిబ్రవరి 11:** విద్యతో పాటు క్రీడల్లో కూడా విద్యార్థులు రాణించాలని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డా.శంకర్‌శర్మ అన్నారు. ఆదివారం నగరంలోని కిడ్స్ వరల్డ్‌లో ఏర్పాటు చేసిన సీలంబం మార్షల్ ఆర్ట్స్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు, జిల్లా హాకీ క్రీడా సంఘం కార్యదర్శి దాసరి సుధీర్, జిల్లా ప్రైవేటు వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు కొండెపోగు సుంకన్న, జిల్లా సీలంబం క్రీడా కార్యదర్శి రాఘవేంద్ర, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మంచి చేసేందుకు ముందుంటాం

● టీడీపీ ఇన్‌చార్జి టీజీ భరత్



వృద్ధులకు చీరలను పంపిణీ చేస్తున్న టీజీ భరత్

**కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 11:** కర్నూలు ప్రజలకు సేవ చే సేందుకు తాము ఎప్పుడూ ముందుంటామని కర్నూలు టీడీపీ ఇన్‌చార్జి టీజీ భరత్ అన్నారు. ఆదివారం నగరంలోని బుధవారపేట ఆర్చ్ వద్ద ఆదరణ డేకేర్ సెంటర్ ఆధ్వర్యంలో పేద, మహిళలు, వృద్ధులకు చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. టీజీ భరత్ మాట్లాడుతూ తాను పుట్టి పెరిగిన కర్నూలు ప్రజలకు సేవ చేయడం కోసమే రాజకీయాల్లోకి వచ్చినట్లు తెలిపారు. కులం, మతం చూడకుండా అందరికీ తాము మేలు చేస్తామన్నారు. వీధుల్లో ప్రజల ఇబ్బందులు తీర్చడంతో పాటు అందరికి సంక్షేమ పథకాలు అందిస్తానని హామీ ఇచ్చారు. హంద్రీ నదిలో పూడికతో పాటు గడ్డి విపరీతంగా పెరిగిపోయిందన్నారు. వరద వస్తే ప్రజల ఇళ్లలోకి నీరు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ప్రజల నుంచి పన్నులు వసూలు చేస్తున్న అధికారులు ప్రజల కోసం పని చేయడంలో విఫలమయ్యారని మండిపడ్డారు. ఆదరణ డేకేర్ సెంటర్ నిర్వాహకులకు ఎప్పటికీ తమ సహకారం ఉంటుందన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి అందరూ మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. కార్యాక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు రామాంజనేయులు, అబ్బాస్, ముంతాజ్, నరేంద్ర, ఆదరణ డేకేర్ సెంటర్ అధ్యక్షులు రంజిత్, టీడీపీ బూత్ ఇన్‌చార్జీలు, తదితరులు పాల్గొన్నారు.

### 'కాపు, బలిజల సంక్షేమాభివృద్ధికి కృషి చేస్తా'

**కర్నూలు (కల్చరల్), ఫిబ్రవరి 11:** కర్నూలు నగరంలో కాపు, బలిజల సంక్షేమం, అభివృద్ధికి తప్పకుండా కృషి చేస్తానని కర్నూలు నియోజికవర్గం తెలుగు దేశం పార్టీ ఇన్‌ఛార్జి టీజీ భరత్ అన్నారు. ఆదివారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో కాపు, బలిజ సంక్షేమ సంఘం ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. టీజీ భరత్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన ప్రభుత్వం రావడం ఖాయమని అన్నారు. కర్నూలులో తనకు అందరి ఆశీస్సులు ఉండాలని, తాను గెలిచిన వెంటనే బి.క్యాంపులో ఉన్న కాపు భవన్ నిర్మాణానికి తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రవణమ్మ, కాపు, బలిజ సంక్షేమ సంఘం సీనియర్ నాయకుడు అర్జా రామకృష్ణ, టీడీపీ నియోజిక వర్గ పరిశీలకులు శ్రీనివాసమూర్తి, జనసేన అసెంబ్లీ ఇన్‌చార్జి అర్షద్, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, కాపు, బలిజ సంఘం నాయకులు పాల్గొన్నారు.

### అదిష్టానం ఆదేశిస్తే కర్నూలు నుంచి పోటీ

● మైనార్టీ సెల్ చైర్మెన్ షేక్ ఖాజా హుస్సేన్



డీసీసీకి దరఖాస్తును ఇస్తున్న నాయకులు

**కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 11:** అదిష్టానం ఆదేశిస్తే కర్నూలు అసెంబ్లీ సీటు నుంచి పోటీ చేస్తానని కర్నూలు నగర ముస్లిం మైనార్టీ సెల్ చైర్మెన్ షేక్ ఖాజా హుస్సేన్ అన్నారు. ఆదివారం విజయవాడలోని ఆంధ్రరత్న కార్యాలయంలో జిల్లా డీసీసీ కే. బాబురావుతో కలిసి కర్నూలు అసెంబ్లీకి దరఖాస్తు చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నాయకత్వంలో కాంగ్రెస్ ఘనవిజయం సాధింస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే పేద, బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్ర భవిష్యత్ కోసం కాంగ్రెస్‌ను ఆదరించాలని విజ్ఞప్తి చేశారు.

### నిట్జూరులో ఎన్ఎస్ఎస్ శిబిరం

**కర్నూలు (కల్చరల్), ఫిబ్రవరి 11:** నగరంలోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1 విభాగం ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా కర్నూలు మండలం నిట్జూరు గ్రామంలో ఎన్ఎస్ఎస్ శిబిరం కొనసాగుతోంది. ఆదివారం మూడో రోజు కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అలాగే గ్రామంలోని బడి, గుడి, చర్చి, మసీదు ప్రాంతాలను చీపుర్లతో ఊడ్చి శుభ్రం చేశారు. ట్రిపుల్ ఐటీ కళాశాలకు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ విశ్వేశ్వరరెడ్డి వలంటీర్లకు స్కిల్ డెవలప్‌మెంట్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్లు డి. వెంకటేశ్వర్లు, ఎ. మల్లికార్జున, కమిటీ సభ్యురాలు స్వాతి కల్యాణి పాల్గొన్నారు.

### ఈక్రాప్ మార్చి 5లోపు పూర్తి చేయాలి

**కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 11:** ఈక్రాప్‌లో నమోదు చేసి తుది జాబితాను మార్చి 5వ లోగా ఆర్‌బీకే కేంద్రాల్లో నోటీసు బోర్డులో ఏర్పాటు చేయాలని కర్నూలు జేడీ వరలక్ష్మి తెలిపారు. ప్రభుత్వం అమలు చేసే పథకాలు, కార్యక్రమాలను అర్హులైన రైతులు అందుకోవాలంటే తప్పనిసరిగా సాగు చేసిన పంటలను ఆర్‌బీకే కేంద్రాలకు వెళ్లి ఈక్రాప్ నమోదులో పంటల సాగు వివరాలను చేర్చాలని జేడీ తెలిపారు.

### 'ఉల్లి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి'

**కర్నూలు (కల్చరల్), ఫిబ్రవరి 11:** జిల్లాలో ఉల్లి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, క్వింటాలుకు రూ.3వేలు తక్కువ కాకుండా ధర కల్పించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. జిల్లాలో బోరుబావుల వద్ద అత్యంత కష్టపడి, పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టి ఉల్లి పంట పండిస్తే సరైన ధర లేకపోవడం వల్ల రైతులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారని, తక్షణమే కర్నూలు మార్కెట్ యార్డు పాలకవర్గం, అధికారులు జోక్యం చేసుకొని రైతులకు న్యాయం చేయాలని కోరారు.

## రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో కర్నూలు జట్టు విజయం



ట్రోఫీని అందుకుంటున్న కర్నూలు జట్టు సభ్యులు

**మద్దికెర, జనవరి 11:** స్థానిక శ్రీవిద్యాసాయి ఇంగ్లీషు మీడియం హై స్కూల్‌లో రాష్ట్ర స్థాయి సూపర్-7 క్రికెట్ చాంపియన్‌షిప్ పోటీల్లో కర్నూలు జట్టు విజయం సాధించింది. ఆదివారం ఫైనల్‌కు వచ్చిన ఇరుజట్లు పోటీ పడుగా.. కర్నూలు జట్టు మొదటి స్థానం, తిరుపతి జట్టు రెండో స్థానం, ప్రకాశం జట్టు మూడో స్థానంలో నిలిచాయి. విద్యాసాయి కళాశాల ఎండీ యజ్ఞం వెంకటమాధవ్, ప్రిన్సిపాల్ బాల సునీత, సీనియర్ క్రికెట్ ఆటగాడు చంద్రశేఖర్, సూపర్-7 క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి భాస్కర్ యాదవ్, క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. గెలుపు, ఓటములు సమానంగా తీసుకోవాలని సూచించారు.సమావేశంలో మాజీ ఎంపీటీసీ డి.శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

## మాజీ మంత్రి నారాయణ ఇంటిపై దాడులు అన్యాయం

**మద్దికెర, జనవరి 11:** మాజీ మంత్రి నారాయణ విద్యాసంస్థల అధినేత నారాయణ ఇంటిపై, కళాశాలలపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యల్లో భాగంగా దాడులకు పాల్పడడం అన్యాయమని సౌత్ ఇండియా కాపు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వైపీ వీరన్న అన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ సీఎం జగన్ కాపులపై కక్ష కట్టి దాడులు చేయిస్తున్నారనిఆరోపించారు. నారాయణ ఇంట్లో తనిఖీలు చేయడం సీఎం జగన్ కుట్రలో భాగమన్నారు. జగన్ డైరెక్షన్‌లో డ్రగ్స్ డీఐజీ రఘురామరెడ్డి ఓవరాక్షన్ చేయడం సిగ్గు చేటన్నారు. జగన్ నేరాలు, ఘోరాల గురించి సొంత చెల్లి షర్మిల చెబుతున్నారని గుర్తుచేశారు.

## కేంద్ర పథకం కార్యాచరణ కమిటీ సభ్యుడిగా ఆదోని వాసి

**ఆదోని టౌన్, ఫిబ్రవరి 11:** ప్రధానమంత్రి నరంద్ర మోదీ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజన పథకం అమలు కోసం జిల్లా ఇంప్లిమెంటేషన్ (కార్యాచరణ) కమిటీ సభ్యుడిగా బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు, ఆదోని ప్రాంతానికి చెందిన మలేకర్ శ్రీనివాస్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ.. వివిధ చేతివృత్తులు చేసుకొంటున్న వారిని కేంద్ర ప్రభుత్వం గుర్తించి వారి ఆర్థిక అభివృద్ధి కోసం తక్కువ వడ్డీతో ఎలాంటి పూచీకత్తులు లేకుండా రూ.మూడు లక్షల దాకా రుణం మంజూరు చేస్తోందని అన్నారు. జిల్లాలో అనేకమంది చేతి వృత్తులపైనే ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారని, అలాంటి వారికి ఈ పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. అర్హులైన అందరికీ ఈ పథకం వర్తించేలా తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

## 800 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

**పెద్దకడుబూరు, ఫిబ్రవరి 11:** మండల పరిధిలోని హనుమాపురం గ్రామ కొండల్లో 800 లీటర్ల నాటుసారా బెల్లం ఊటను ధ్వంసం చేసి, 40 లీటర్ల నాటురాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మహేష్ కుమార్ తెలిపారు. అదివారం ఆయన మాట్లాడుతూ డీఎస్పీ సీతారామయ్య ఆదేశాల మేరకు ఈ దాడులు చేసినట్లు తెలిపారు.

## మాచయ్యస్వామి గుడి నిర్మాణానికి స్థల విరాళం

**పెద్దకడుబూరు, ఫిబ్రవరి 11 :** మండల కేంద్రంలో రజకుల కుల దైవం మడివాళ మాచయ్యస్వామి దేవాలయం నిర్మాణానికి మంత్రాలయం టీడీపీ నాయకుడు మధుసూదన్ రెడ్డి ఆదివారం దాదాపు 6 లక్షలు విలువ చేసే 2.5 సెంట్ల స్థలాన్ని రజకుల కోసం దానంగా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో తిక్కారెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ వీఆర్వో కృష్ణమూర్తి, చాకలి హనుమంతు, వీరేష్, శేఖర్, రంగస్వామి , లక్ష్మన్న పాల్గొన్నారు.

## మంత్రాలయంలో భక్తుల కోలాహలం

**మంత్రాలయం, ఫిబ్రవరి 11:** పండితుల మంత్రోచ్చరణాలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవేంద్రస్వామి పూర్వఅవతారమైన ప్రహ్లాదరాయలు రజిత గజవాహనంపై రమణీయంగా ఊరేగారు. ఆదివారం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో ప్రహ్లాదరాయలకు పాదపూజ, బృంధావనానికి ప్రత్యేక అభిషేకాలు చేసి ప్రత్యేంగా అలంకరించారు. స్వామివారిని పల్లకిలో ఊరేగించిన అనంతరం వెండి ఏనుగు రథంపై స్వామి వారిని అధిష్టించి విద్యుత్ వెలుగు కాంతులతో భక్తుల జయధ్వానాల మధ్య ఊరేగారు.

## మంత్రాలయం శ్రీమఠంకు రూ.2 లక్షల విరాళం

మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి బెంగుళూరు చెందిన అజ్ఞాత భక్తుడు రూ.2 లక్షలు అన్నదానానికి విరాళంగా అందజేశారు. ఆదివారం కుటుంబ సమేతంగా రాఘవేంద్రస్వామిని దర్శించుకుని రూ.2 లక్షలు నగదు ఇచ్చినట్లు మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషీలు తెలిపారు. విరాళం ఇచ్చిన దాత కుటుంబ సభ్యులకు పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు రాఘవేంద్రస్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫలపుష్ప మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.



# నాలుగు నెలలుగా అందని ఉపాధి కూలి డబ్బు

● అర్ధాకలితో పనులు చేయలేమంటున్న ఉపాధి కూలీలు

**జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేసిన కూలీలకు నిబంధనల మేరకు 15 రోజుల్లోగా వేతనాలు చెల్లించాలి. స్వరాజ్ అభియాన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో 2018 మే 18న సుప్రీం కోర్టు ఇచ్చిన ఆర్డర్‌లో ఇదే విషయాన్ని స్పష్టం చేసింది. గడువు లోపు చెల్లింపులు చెల్లించకపోతే చట్ట ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని అత్యున్నత న్యాయస్థానం అప్పట్లో ఆదేశించింది. అయితే, కర్నూలు జిల్లా హొళగుందలో ఒకటి కాదు..రెండు కాదు.. నాలుగు నెలలుగా ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతున్నా అధికారులకు, పాలకులకు పట్టకపోవడం శోచనీయం. అసలే కరువు ప్రాంతం ప్రభుత్వ చట్టం అమలు కాక.. కూలి పనులు లేక మండల వ్యవసాయ కూలీలు ఆకలితో అలమటిస్తున్నా పట్టించుకోకపోవడం శోచనీయం.**

**హొళగుంద, జనవరి 31 :** రెక్కాడితే గాని డొక్కాడని బతుకులు వారివి. రెండు వారాలకోసారి ఇవ్వాల్సిన కూలి పైసలు నాలుగు నెలలైనా ఇవ్వకపోవడంతో అర్ధాకలితో కూలీలు అలమటిస్తున్నారు. ఆకలితో పనులు చేయలేమని కూలీలు తేల్చిచెబుతున్నారు. హొళగుందలో 700 కుటుంబాలు ఉపాధి జాబ్ కార్డులు కలిగి ఉన్నాయి. వీరిలో 300 మందికి పైగా ప్రతిరోజూ ఉపాధి పనులకు వెళ్తారు. పూడికతీత, భూములు చదును, ఫారం పాండ్స్, కాలువలు తీయడం, చెరువులో పిచ్చి మొక్కలు తొలగించడం లాంటి పనులు చేస్తున్నారు. గ్రామ పంచాయతీ తీర్మానం మేరకు గుర్తించిన పనులను అధికారులు కూలీలకు ఇస్తున్నారు. అయితే, నాలుగు నెలలు గడిచినా ఉపాధి కూలీల బకాయిలు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని కూలీలు ఆవేదన చెందుతున్నారు.


హొళగుందలో ఉపాధి పనికి వచ్చిన కూలీలు

**ప్రభుత్వం నుంచి రాకపోతే మేమేం చేయాలి?**
రెండు వారాలకోసారి ఆన్లైన్లో నమోదు చేస్తున్నాం. ప్రభుత్వం నుంచి కూలి డబ్బు రాకపోతే మేమేం చేయగలం.
**- భక్తవత్సలం ఏపీవో, ఎన్ఆర్ఈజీఎస్.**

**వలస పోనివ్వరు.. కూలి పైసలు ఇవ్వరు**
నాకు నలుగురు పిల్లలు. ఉపాధి పనికి పోతేనే మా కుటుంబానికి తిండి. కూలి పైసలు ఇస్తలేరు. వేరే ఊరికి వలస పోదామంటే అధికారులు పోనివ్వడం లేదు. నాలుగు నెలలుగా ఉపాధి కూలి పైసలు రావాలి. ఏమి తిని బతకాలో మీరైనా చెప్పండి.
**- పాతిమా, ఉపాధి కూలీ, హొళగుంద**

**ఆరురోజులు పనిచేస్తే నాలుగు రోజుల కూలి ఇస్తున్నారు..**
ఆరు రోజులు ఉపాధి పనులు చేస్తే కూలి మాత్రం నాలుగు రోజులకే ఇస్తున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కష్టపడు తున్నాం. వారానికి రూ.500 కూలి ఇస్తున్నారు. గతంలో రెండు వారాలకు ఒకసారి రూ.900 నుంచి రూ.1200 వరకు కూలి డబ్బు పడేది. ఇప్పుడు మాత్రం రూ.500 మాత్రమే వస్తోంది. నాలుగు నెలలయినా కూలి డబ్బు ఇవ్వడం లేదు. కుటుంబాలు గడవడం చానా కష్టమైంది.
**-షమీఉల్లా, కూలీ, హొళగుంద గ్రామం**

## ఎండుమిర్చి క్వింటా రూ.26,229

● ఐదు రోజుల్లో రూ.6 వేలకు పైగా పెరిగిన ధర

**ఆదోని (అగ్రికల్చర్) ఫిబ్రవరి 11:** ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పతనమైన ఎండుమిర్చి ధరలు మళ్లీ పెరిగాయి. ఆదివారం రైతులు విక్రయానికి తెచ్చిన ఎండుమిర్చికి గరిష్ఠంగా క్వింటాలు రూ.26,299 పలికింది. మళ్లీ ధరలు పెరుగుతుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బ్యాడిగి రకం ఎండుమిర్చి ధర క్వింటాలు ధర రూ.26,299, డాబా రకం ధర 18,009, కడ్డీ బ్యాడిగి రకం ధర రూ.15వేలు, సింజెంటా రకం ధర రూ.16,229, డీడీ రకం మిర్చి ధర రూ.16,500, ఎస్ఎస్ రకం మిర్చి ధర రూ.18,518, తేజ రకం మిర్చి 18,050 పలికింది. 1406 బస్తాలు ఎండుమిర్చి విక్రయానికి రాగా వాటి క్వింటాలు కనిష్ఠ ధర రూ.5,500, గరిష్ఠ ధర రూ.26,229, మధ్యస్థ ధర రూ.11,000 పలికింది.


ఆదోని మార్కెట్‌కు వచ్చిన ఎండుమిర్చి

# వైసీపీని భూస్థాపితం చేద్దాం

● పత్తికొండ టీడీపీ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు

**తుగ్గలి, ఫిబ్రవరి 11:** రాక్షస వైసీపీ పార్టీని భూస్థాపితం చేసి టీడీపీకి పట్టం కడుదామని పత్తికొండ టీడీపీ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని బొందిమడుగులలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. అలాగే గ్రామానికి తాగునీరు అందించాలని స్థానికులు కోరారు. ఈ సందర్భంగా కేఈ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు కాగానే ఇంటింటికీ కొళాయి వేయిస్తామని, ప్రతి ఇంటికీ అన్ని సంక్షేమ పథకాలు అందుతాయని భరోసా ఇచ్చారు. మహాశక్తి పేరుతో మినీ మేనిఫెస్టోను టీడీపీ అధినేత చంద్రబాబు విడుదల చేశారని, ఈ మహాశక్తి, తల్లికి వందనం పథకాలతో మహిళలు అభివృద్ధి చెందుతారని పేర్కొన్నారు. ఒక్కచాన్స్ అంటూ గద్దెనెక్కి రాష్ట్రాన్ని అధోగతి పాల్జేశారని, ఇలాంటి పిచ్చి తుగ్లక్‌కు ఓటుతోనే బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తిరుపాల్ నాయుడు, ప్రతాప్‌యాదవ్, వెంకట్రాముడు, మోహన్ యాదవ్, తలారి రాముడు, కేపీ రమేష్, దేవదాసు గౌడు, నల్లగుండ్ల రవి, మహేష్‌గౌడు, చంద్రశేఖర్ యాదవ్, వెంకటేశ్వర్లు, క్రిష్ణ, సోమశేఖర్‌గౌడు, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.


బొందిమడుగులలో శ్యాంబాబుకు సమస్యలు వివరిస్తున్నవృద్ధురాలు

### సైనికుల్లా పని చేయాలి : కేఈ

**మద్దికెర :** తెలుగుదేశం పార్టీ విజయం కోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని తాలుకా తెలుగు యువత ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు అన్నారు. మద్దికెర గ్రామానికి చెందిన గౌండా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న 40 మంది తెలుగు యువత కార్యకర్తలు ఆదివారం టీడీపీ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబును సన్మానించారు. కార్యక్రమంలో మద్దికెర గ్రామానికి చెందిన తెలుగు యువత నాయకులు గడ్డం మల్లికార్జున, ఈశ్వరయ్య, తదితరులు ఉన్నారు.

## ఏం ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతారు

**ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 11:** రాబోయే ఎన్నికల్లో ఏ ముఖం పెట్టుకొని వైసీపీ నాయకులు ఓట్లు అడుగుతారని టీడీపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ దయాసార్, టీడీపీ కౌన్సిలర్ రామదాసు గౌడ్, టీడీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఉసేన్ పీరా అన్నారు. ఆదివారం 21వార్డులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీ, స్థానిక వైసీపీ ఇన్‌చార్జీ బుట్టా రేణుక జగనన్న నవరత్నాలతో ఎన్నికల్లో గెలుస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. బుట్టా రేణుక కేవలం తన ఆస్తులను కాపాడుకునేందుకు ఎన్నికల్లో పోటీచేస్తున్నారని ఆరోపించారు. ఎక్కడో సిటీలో ఉంటూ వ్యాపారాలు, పబ్బులు నడిపే వారు ప్రజలకు ఏమి సేవచేస్తారని ప్రశ్నించారు. నియోజకవర్గంలో బీసీలు ఎవరు లేరనే విధంగా ఇతర ప్రాంతాలకు చెందిన వారిని వైసీపీ దిగుమతి చేసుకోవటాన్ని బట్టి చూస్తే వైసీపీ ఎంత బలహీనంగా ఉందో అర్థమవుతుందని పేర్కొన్నారు. ఎమ్మిగనూరు అభివృద్ధికి కృషి చేసింది బీవీ కుటుంబమేనన్నారు. రాబోయే ఎన్నికల్లో బీవీని భారీ మెజార్టీతో ప్రజలు గెలిపించేందుకు ప్రజలు సంసిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు.


మాట్లాడుతున్న దయాసాగర్

# ఘనంగా వాసవీమాత ఆత్మార్పణ దినం

**ఆదోని టౌన్, ఫిబ్రవరి 11:** స్థానిక నగరేశ్వర దేవాలయంలో ఆదివారం ఆర్యవైశ్యుల ఇలవేలుపు వాసవీ కన్యకా పరమేశ్వరి మాతా ఆత్మార్పణ దినం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆవోపా యువజన సంఘం మహిళా మండలి వారు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఇరుముడి కార్యక్రమం, మాడ వీధులలో ఉత్సవ విగ్రహ ఊరేగింపు, మూల విరాట్‌కు పాలాభిషేకం, కుంకుమార్చన, వాసవి హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను వేదపండితులు నిర్వహించారు. అమ్మవారు బంగారు చీరలో శోభయమానంగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ప్రకాష్, వేణు, ఆవోపా అధ్యక్ష, కార్యదర్శులు వంకదారు శ్రీనాథ్ గుప్తా, శ్రీధర్, టీజీ రామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


వాసవీమాత హోమంలో పాల్గొన్న భక్తులు

# అపూర్వ సమ్మేళనం

● పాఠశాల రుణం తీర్చుకుందాం
● జొన్నగిరి 1995-96 జడ్పీ స్కూల్ విద్యార్థులు
● రూ.4 లక్షలతో డైనింగ్ హాలు ఏర్పాటు

**తుగ్గలి, ఫిబ్రవరి 11:** చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం మండల పరిధిలోని జొన్నగిరి జిల్లా పరిషత్ హై స్కూల్‌లో 1995-96 పదవ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. వారికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను పూలమాలలు వేసి శాలువలతో సన్మానించారు. ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకుని సంతోషంగా గడిపారు. పూర్వ విద్యార్థులంతా కలిసి పాఠశాలలో పూర్వ విద్యార్థుల సొంత డబ్బు రూ.4 లక్షలతో నిర్మించిన డైనింగ్ హాలును ప్రారంభించారు. అలాగే భవిష్యత్తులో పాఠశాల అభివృద్ధి కోసం తమ వంతు కృషి చేస్తామని, పేద విద్యార్థులకు కూడా సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల ఆర్గనైజింగ్ కమిటి సభ్యులు జయరాముడు, మహబూబ్ బాషా, చంద్రమోహన్ రెడ్డి, ఖాజా హుశేన్, నీలకంఠ తదితరులు పాల్గొన్నారు.


జొన్నగిరిలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

## 22 ఏళ్ల తర్వాత ఒక్కచోట చేరిన విద్యార్థులు

**ఆదోని (అగ్రికల్చర్) ఫిబ్రవరి 11:** ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలల్లో 1999-2002లో బీకాం చదువుకున్న పూర్వ విద్యార్థులు 22 ఏళ్ల తర్వాత ఆదివారం కలుసుకున్నారు. ఆడుతూ పాడుతూ.. అలనాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకొని ఆనందంగా గడిపారు. అలనాటి అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సరేష్, అధ్యాపకులు అయ్యప్ప, రామకృష్ణ, చంద్రశేఖర్, పూర్వ విద్యార్థుల అసోసియేషన్ అధ్యక్షులు యగ్గట్టి మహదేవప్ప మాట్లాడుతూ ఆర్ట్స్ కళాశాలకు ఓ చరిత్ర ఉందని, ఎందురో విద్యార్థులు ఇక్కడ చదివి నేడు ఉన్నత స్థాయిలో ఉన్నారన్నారు. 22 ఏళ్ల తర్వాత అందరినీ కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు స్వరూప్, అనోకు, చిరంజీవి, భాస్కర్, శ్రీనివాస్, వెంకటేష్, గురురాజ, రమేష్, ఉదయ్, రామకృష్ణ, స్వామి, కేశవ్ రెడ్డి, జగదీష్, గిడ్డయ్య పాల్గొన్నారు.



22 ఏళ్ల తరువాత గురువులతో పూర్వవిద్యార్థులు

## దూదేకులు ఐక్యతతో మెలగాలి

**దేవనకొండ ,ఫిబ్రవరి 11:** దూదేకులు ఐక్యతతో మెలగాలని సంఘం నాయకులు మలకన్ననబిరసూల్, అల్లీపీరా అన్నారు. స్థానిక రెయిన్ బో పాఠశాలలో ఆదివారం దూదేకుల సమావేశం నిర్వహించారు. పేదలను అదుకునేందుకు త్వరలో ప్రత్యేక నిధి ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలిపారు. మండల, గ్రామాల నూతన కమిటీలని ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. చట్టసభలలో దూదేకులకు రాజకీయ పార్టీలు ప్రాధాన్యతనిచ్చి సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

## అనాథ శవానికి అంత్యక్రియులు

**ఆదోని (అగ్రికల్చర్) ఫిబ్రవరి 11:** ఆదోని పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో అనారోగ్య కారణంతో చికిత్స పొందుతూ ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందారు. వైద్యులు గ్లోబల్ సర్వీస్ సొసైటీ వారికి అనాథ శవానికి అంత్యక్రియల చేయాలని సూచించారు. సొసైటీ సభ్యులు కాటికాపారుల సంఘం అధ్యక్షుడు వెన్నెల యువరాజు, అంజి, రంగస్వామి, రామంజి ఆసుపత్రిలో ఉన్న అనాథ శవాన్ని హిందూ స్మశాన వాటికలో అంత్యక్రియులు చేశారు.

## పల్లెపాడులో నీటి సమస్య పరిష్కారం


తిక్కారెడ్డిని సన్మానిస్తున్న పల్లెపాడు గ్రామవాసులు

**కోసిగి, ఫిబ్రవరి 11:** అధికారం లేకపోయినా ప్రజల వెంటే ఉంటూ సొంత ఖర్చులతో గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించి మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి తిక్కారెడ్డి పల్లెపాడు గ్రామస్థుల మన్ననలు పొందారు. పల్లెపాడు గ్రామంలో తాగునీటి కొరతను తీర్చేందుకు తిక్కారెడ్డి తన సొంత నిధులతో గ్రామంలో బోరు వేయించారు. నీరు రావడంతో పల్లెపాడు గ్రామ ప్రజలు, మాజీ సర్పంచు చంద్ర ఆధ్వర్యంలో ఆదివారం తిక్కారెడ్డిని శాలువలు, పూలమాలలతో సన్మానించారు. వేసవి సమయంలో తమ గ్రామానికి సొంత ఖర్చుల ద్వారా బోరు వేసి తిక్కారెడ్డి తమ దాహార్తిని తీర్చారని పల్లెపాడు గ్రామ ప్రజలు కొనియాడారు. అనంతరం ఎరిగేరి గ్రామంలో టీడీపీ గ్రామ నాయకుడు స్టేషన్ బసవరాజు నూతన గృహప్రవేశానికి టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్పతో కలసి తిక్కారెడ్డి హాజరయ్యారు.

## గోనెగండ్లలో వైభవంగా బీరప్పస్వామి జాతర

**గోనెగండ్ల, ఫిబ్రవరి 11:** మండల కేంద్రమైన గోనెగండ్లలో ఆదివారం బీరప్ప స్వామి జాతర మహోత్సవం కన్నుల పండువగా సాగింది. ఈ సందర్భంగా బీరప్ప దేవాలయాన్ని రంగులతో విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ఉదయం తుంగభద్ర కాలువ దగ్గర ఉన్న కాశీవిశ్వేశ్వర దేవాలయం నుంచి బీరప్ప స్వామి వారి పల్లకోత్సవం ప్రారభమైంది. ఈ కార్యక్రమంలో భక్తులు పలు గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కాశీ విశ్వేశ్వర దేవాలయం నంచి బీరప్పస్వామి దేవాలయం వరకు సాగిన పల్లకోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పలుగ్రామాల నుంచి వచ్చిన గొరవయ్యల నృత్యం ఎంతో ఆకట్టుకుంది. పల్లకోత్సవం సాగే దారి వెంట భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు, భక్తి గీతాలు అలాపించారు. అలాగే సోమవారం ఉదయం హోమం, పౌంజాట, గొరవయ్యల పూజ కార్యక్రమం ఉంటుదని పూజారులు తెలిపారు. రాత్రి అన్నదానం నిర్వహించారు.

## వైసీపీ పతనం మొదలయ్యింది: కోట్ల

**నందవరం, ఫిబ్రవరి 11:** వైసీపీ ప్రభుత్వ పతనానికి నాంది మొదలయ్యిందని మాజీ కేంద్ర మంత్రి కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. ఆదివారం కనకవీడులో ఆయన మాట్లాడుతూ ఎన్నికలు వస్తే జగన్‌ను తరిమి కొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా టీడీపీ సిద్ధంగా ఉందన్నారు. జగన్ సీమ ప్రాజెక్టులను తెలంగాణాకు తాకట్టు పెట్టరని, దీంతో సీమ ఎడారిగా మారిందని ప్రజలు వలసలు వెళ్తున్నా వారికి పనులు కల్పించలేని ప్రభుత్వం ఎందకని ప్రశ్నించారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు గుండ్రేవులు, వేదవతి, ఆర్డీఎస్ కుడికాలవ పనులు చంద్రబాబు అధికారంలోకి రాగానే పూర్తి చేస్తామన్నారు. అభివృద్ధి పేరుతో అప్పులు తెచ్చి బటన్ నొక్కడానికే పరిమితమైన జగన్‌కు వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ప్రజలు బటన్ నొక్కి సాగనంపేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ పార్థసారధిరెడ్డి, సుధాకరశెట్టి, కదిరికోట ఆదెన్న, కురవన్న, వలీ, బాషా, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

## మెకానిక్ దుకాణాల్లో చోరీ

**ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 11:** స్థానిక పార్కురోడ్డులో స్టేట్ బ్యాంకు సమీపంలో ఉన్న మెకానిక్ దుకాణాల్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు.. కొంతకాలంగా ఖాజా టూవీలర్ మెకానిక్, మన్సూర్ బేగ్ కార్ మెకానిక్, అన్వర్ ఆటో మెకానిక్, రహంతుల్లాలు మెకానిక్ దుకాణాలు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. శనివారం రాత్రి దొంగలు దుకాణాల తాళాలు పగలగొట్టి ఓ దుకాణంలో ఉన్న రూ. 2100 దొంగలించుకుపోయారు. ఆదివారం దుకాణాలను తెరిచేందుకు వచ్చిన యజమానులు చూసి దొంగతనం జరిగిందని గ్రహించారు.

## సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ నూతన కమిటీ ఏర్పాటు

**ఎమ్మిగనూరుటౌన్, ఫిబ్రవరి 11:** పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో ఏపీ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మునెప్ప ఆధ్వర్యంలో సెక్యూరిటీ గార్డ్స్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నాగరాజు, ఉపాధ్యాక్షులుగా ఏసేపు, మహబూబ్ బాషా, కార్యదర్శిగా సలాం, సహాయకార్యదర్శిగా శ్రీనివాసులు, హరీష్, కోశాధికారిగా ఉమామహేశ్వరితో పాటు ఆరుగురు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం : టీడీపీ

**ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 11:** అకాల మరణం పొందిన టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని 20వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి శ్రీనివాసాచారి అన్నారు. ఆదివారం దివాకర్ రెడ్డి నగర్‌లో గొల్ల గోపాల్ భార్య గొల్ల లక్ష్మీ అనారోగ్యంతో మృతి చెందగా, అదే వార్డులో మరో మహిళ అయ్యమ్మ మృతి చెందింది. అంత్యక్రియల ఖర్చు కోసం ఆయన ఒక్కొక్కరికి రూ.5 వేల నగదు వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ధైర్యంగా ఉండాలని కుటుంబసభ్యులకు సూచించారు. ఆయన వెంట డిష్ రవి, మల్లప్ప, వీరేష్, రాందాస్ పాల్గొన్నారు.